# తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :47 01-09- 2026 మంగళవారం పేజీలు: 4 వెల:03/-



తెలంగాణ వెన్నెల వాక్కు
విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో


# బయో కంపెనీల మాయాజాలం

## – పురుగు మందుల షాపులు ఏరియాకి ఒక్కటే ఉండాలి
## – వ్యవసాయశాఖ అధికారుల నియంత్రణ కొరవడుతోంది..



**నిర్మల్ ఆగష్టు 31 తెలంగాణ వెన్నెల వాక్కు**

రైతుల దిగుబడి ఆశలను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని బయో కంపెనీలు ఊహించని రీతిలో మాయాజాలం ప్రదర్శిస్తున్నాయి. ఆయా కంపెనీ లు గుప్పిస్తున్న రంగురంగుల ప్రచారా లు, ఆకర్షణీయమైన పోస్టర్లు, కరపత్రా లు, సామాజిక మాధ్యమాల ప్రకటనలను నమ్మి నిర్మల్ జిల్లా పరిధిలోని రైతులు తీవ్రంగా మోసపోతున్నారు. మార్కెట్లో రోజురోజుకూ నాణ్యత లేని, నిషేధిత, నకిలీ పురుగు మందుల విక్రయాలు యథేచ్ఛగా విస్తరిస్తున్నాయి. పంటలకు తెగుళ్ళు వస్తే ఎంతో కష్టపడి సాగు చేసిన పంట ఎక్కడ చేతికందకుండా పోతుందోననే భయంతో ఉన్న రైతులను ఈ కంపెనీలు సులభంగా తమ బురిడీ వ్యాపారంలోకి దింపుతున్నాయి.

అధిక దిగుబడి ఇస్తామనే నెపంతో మరియు పంటలను అన్ని రకాల తెగుళ్ళ నుండి కాపాడతామని నమ్మబలుకుతూ కొన్ని రకాల క్రిమిసంహారక, శీఘ్ర ఉత్పాదక మందులను కంపెనీలు మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. నిర్మల్ జిల్లాలోని రైతులు కూడా వివిధ పేర్లతో తమ ముందుకు వస్తున్న ఆకర్షణీ యమైన పురుగు మందులను తెచ్చి తమ పొలాల్లో పిచికారీ చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే, ఈ ఉత్పత్తుల ప్రచారా నికి కంపెనీలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ మందులు పంటలపై ఎటువంటి ప్రభావం చూపడం లేదన్న చేదు నిజాలను కప్పిపుచ్చుతున్నాయి. ప్రధానంగా ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికలే వీరి దొంగ ప్రచారానికి అడ్డాగా మారుతున్నాయి. యూట్యూబ్ వీడియోల్లో శాస్త్రీయ ఆధారం లేని ప్రకటనలను చూసి అమాయక రైతులు ఏమాత్రం ఆలోచించకుండా తమ కష్టార్జితాన్ని ఆ మందుల కొనుగోలు కోసం విచ్చలవిడిగా ఖర్చు చేసుకుంటూ ఆర్థికంగా తీవ్ర అప్పులపాలవుతున్నారు.

మరోవైపు, షాపుల్లో దొరుకుతున్న పురుగు మందుల నాణ్యతను తనిఖీ చేయడంలో మరియు నియంత్రించడంలో వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభు త్వ నిబంధనల ప్రకారం ఒకే ఏరియాలో లేదా ఒకే ప్రాంతంలో లైసెన్స్ కలిగిన ఒకే షాపునకు ప్రాథమిక అనుమతి ఉండాలి. కానీ ఆ నిబంధనలను బొందపెట్టి అధికారు లు పట్టించుకోకపోవడంతో వీధికో దుకాణం వెలుస్తోంది. నిర్మల్ జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వ్యాపారులు పక్క జిల్లాల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి నాణ్యత లేని, తక్కు వ ధరకు లభించే నకిలీ పురుగు మందులను తెచ్చి ఇక్కడ అధిక ధరలకు రైతులకు విక్రయిస్తున్నారు. వ్యవసాయ రసాయనాల పై, సాంకేతిక అంశాలపై రైతులకు సరైన శాస్త్రీయ పరిజ్ఞానం లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, పక్క జిల్లాల నుంచి ఏజెం ట్లు,దళారులు నేరుగా గ్రామాల్లోకి వచ్చి విచ్చలవిడిగా దందా సాగిస్తున్నారు.

**అనుమతి లేని పురుగు మందుల షాపుల విజృంభణ:**

నిర్మల్ జిల్లాలోని పలు ప్రాంతాలలో పురుగు మందుల షాపులను ఎటువంటి చట్టబద్ధ నిబంధనలు పాటించకుండానే నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. పెస్టిసైడ్స్ చట్టాలు, నిబంధనల ప్రకారం ప్రైవేటు పురుగు మందులు లేదా బయో ఉత్పత్తుల షాపులు నడపాలంటే విద్యా అర్హతలు, లైసెన్సులు, గోదాముల నాణ్యత తదితర అనుమతులు తప్పనిసరి. కానీ క్షేత్రస్థాయిలో ఈ పరిస్థితులు మరింత దిగజారిపోయాయి. అర్హత లేని వ్యక్తులకు కూడా ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చేస్తున్నారనే తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక్కో షాపు యజమాని పేరిట లేదా ఒకే పత్రం మీద లెక్కలేనన్ని సబ్-షాపులు, ఏజెన్సీలు ఆధారపడి నడుస్తున్నాయి. నాణ్యత లేని పురుగు మందుల వ్యాపారం చేసేవారు కేవలం స్వార్థ లాభాల కోసమే, కంపెనీలు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడి మార్కెట్లో అసలు అనుమతి లేని, దొరకని రకం నిషేధిత పురుగు మందుల షాపులను వెలియజేశారు. పురుగు మందుల షాపులు పెట్టడానికి కావలసిన సాంకేతిక అర్హతలు, నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమైనవని తేలిపోతో ంది. ఈ రకమైన అక్రమ అమ్మకాల వెనుక రైతాంగం ఆర్థికంగా, పంట దిగుబడి పరంగా ఎంతో నష్టపోతోందని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో అనుమతులు లేని షాపుల్లో ఎక్కడ పడితే అక్కడ ఇష్టారాజ్యంగా వ్యాపారం జరుగు తోంది. ఈ మందుల్లో నాణ్యతా ప్రమాణాల ఉల్లంఘనలు బహిరంగంగానే కనిపిస్తున్న ప్పటికీ తనిఖీలు చేసే నాథుడే కరువ య్యాడు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పక్క జిల్లాల వ్యాపారులు మరియు హోల్‌సేల్ డీలర్లు ఇక్కడి గ్రామీణ ప్రాంతాలకు వచ్చి యథేచ్ఛగా అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతా లు ఈ నకిలీ వ్యాపారానికి ప్రధాన కేంద్రా లుగా మారుతున్నాయి.

కావున, బయో కంపెనీలు ప్రదర్శిస్తున్న ఈ వ్యాపార మాయాజాలాన్ని, గ్రామీణ ప్రాంతా ల్లో సాగుతున్న అనధికార అమ్మకా లను తక్షణమే అరికట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. సంబంధిత నిర్మల్ జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో దాడులు నిర్వహించి, నాణ్యతా ప్రమాణాలు పాటించని దుకాణాల లైసెన్సులను రద్దు చేయాలి. అలాగే ఇతర ప్రాంతాల నుంచి జరుగుతున్న అక్రమ రవాణాను కఠినంగా నియంత్రించి రైతులకు న్యాయం చేయాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది.

# వెలిగొండపై హరీశ్‌రావు ఫైర్

### తెలంగాణ నీటి హక్కులను ఏపీకి వదిలేస్తారా?
### కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు నీరేది?..
### రేవంత్ సర్కారుపై తీవ్ర విమర్శలు



హైదరాబాద్ బ్యూరో: కృష్ణా జలాల వినియోగం, ఏపీకి నీటి తరలింపుపై తెలంగాణలో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను బేసిన్ దాటి తరలిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణకు కేటాయింపులు లేకపోయినా, వరద జలాలు అందుబాటులో లేని పరిస్థితుల్లోనూ ఏపీ ప్రభుత్వం నీటిని తరలిస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం ఈ విషయంలో చోద్యం చూస్తోందని మండిపడ్డారు.

తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న సమయంలో పొరుగు రాష్ట్రానికి నీటిని తరలించడాన్ని ఎలా సమర్థిస్తారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఒకవైపు కృష్ణా బేసిన్‌లో భాగమైన భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులకు తగినంత నీరు లేక ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం నీటిని తరలిస్తోందని ఆరోపించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కంటే ఏపీ ప్రయోజనాలకే రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా పరిస్థితులు కనిపిస్తున్నాయని విమర్శించారు.

**వెలిగొండపై అభ్యంతరం ఎందుకు?**

శ్రీశైలం జలాశయం నుంచి నీటి వినియోగం, తరలింపు విషయంలో రెండు రాష్ట్రాల మధ్య చాలాకాలంగా వివాదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ కుడికాల్వ తదితర మార్గాల ద్వారా నీటి తరలింపుపై గతంలోనూ తెలంగాణలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఇప్పుడు వెలిగొండ ప్రాజెక్టు కూడా ఆ జాబితాలో చేరిందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాలను రాష్ట్రంలోని ప్రాజెక్టులకు మళ్లించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఉందని హరీశ్‌రావు అన్నారు. రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండతో పాటు కృష్ణా బేసిన్ పరిధిలోని అనేక ప్రాంతాల రైతాంగం సాగునీటి కోసం ఎదురు చూస్తోందని తెలిపారు. ఇలాంటి సమయంలో తెలంగాణ వాటాపై స్పష్టమైన వైఖరి తీసుకోకుండా ఏపీ నీటి వినియోగంపై ప్రభుత్వం మౌనం వహించడం రైతాంగానికి తీరని అన్యాయమని ఆరోపించారు.

**రైతులకు నీరేది?**

వర్షాలు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత, సాగు విస్తీర్ణం వంటి అంశాలపై ఆధారపడి తెలంగాణలో రైతులు సాగు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారని 2

# నన్ను బెదిరిస్తున్నారా?
# ప్రభుత్వ ఉద్యోగులపై సీఎం రేవంత్ ఫైర్



హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, నిరసనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను తీవ్రంగా తప్పుపట్టిన ఆయన, కొందరు ఉద్యోగ సంఘాల నేతలు సర్కారును హెచ్చరించే ధోరణిలో మాట్లాడటం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "నన్ను బెదిరిస్తున్నారా? ఒత్తిళ్లకు భయపడే ప్రసక్తే లేదు" అంటూ ఉద్యోగులు మరియు సంఘాల నాయకుల వైఖరిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సచివాలయం నుంచి క్షేత్రస్థాయి వరకు పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఉద్యోగులే ప్రభుత్వానికి ఎదురుతిరిగేలా వ్యవహరించడం సమంజసం కాదని స్పష్టం చేశారు.

**గత పాలనకు, ఇప్పటికి పోలిక ఏంటి?**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టంగా గుర్తుచేశారు. గత పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు కూడా సరిగ్గా అందలేదని, నెలల తరబడి వేతనాలు ఆగిపోయి ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డారని ఆయన పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో పడినా అప్పటి ప్రభుత్వాన్ని ఎవరూ ప్రశ్నించలేదని తెలిపారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఎన్నో ఆర్థిక పరిమితులు మరియు గత ప్రభుత్వం చేసి వెళ్లిన వేల కోట్ల అప్పుల భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లించేలా చర్యలు 2

# సంతోష్, హరీశ్‌లను క్షమిస్తా కానీ ప్రశాంత్ రెడ్డిని వదలను
## కల్వకుంట్ల కవిత సంచలన హెచ్చరిక



నిజామాబాద్ బ్యూరో

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి తీవ్ర కలకలం రేగింది. 'తెలంగాణ రక్షణ సేన' అధినేత్రి కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి, బీఆర్ఎస్ ముఖ్య నేత వేముల ప్రశాంత్ రెడ్డిపై చేసిన సంచలన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర వేడి పుట్టించాయి. నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన "పాంచజన్యం సంకల్ప సభ"లో పాల్గొన్న కవిత, తీవ్ర భావోద్వేగానికి గురవుతూ ప్రశాంత్ రెడ్డిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. "జీవితంలో ఎంతటి వారినైనా క్షమిస్తాను.. జోగినపల్లి సంతోష్ కుమార్, తన్నీరు హరీశ్ రావులను కూడా క్షమిస్తా కానీ ప్రశాంత్ రెడ్డిని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టను" అంటూ బహిరంగ వేదికపైనే కవిత బహిరంగంగా సంచలన హెచ్చరిక చేశారు.

?తండ్రీ బిడ్డల మధ్య చిచ్చు పెట్టారు!

తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ (ఖజ=) మరియు తన మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు రావడానికి మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డే ప్రధాన కారణమని కవిత తీవ్రంగా ఆరోపించారు. "తండ్రీ బిడ్డలమైన మమ్మల్ని విడదీయడంలో ప్రశాంత్ రెడ్డి అత్యంత కీలక పాత్ర పోషించారు. తండ్రి నుంచి నన్ను దూరం చేసే కుట్రలు చేసి, నన్ను మానసిక వేదనకు గురిచేశారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మాట్లాడే సమయంలో కవిత తీవ్ర భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్నారు. సొంత ఇల్లే తనను బయటకు తోసేసిన పరిస్థితి వచ్చిందని, తన పుట్టింటి వాళ్లు గెంటేసినా అత్తింటి వాళ్లు అక్కున చేర్చుకుని తనకు అండగా నిలిచారని ఆమె సభలో గుర్తు చేసుకున్నారు.

గోడ దూకేందుకు ప్రయత్నించిన నాయకుడు

ప్రశాంత్ రెడ్డి నమ్మకద్రోహానికి ఒడిగట్టారని కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో ప్రశాంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీని వీడి వేరే పార్టీలోకి మారేందుకు ప్రయత్నించారని, ఆ విషయాలన్నీ తనకు క్షుణ్ణంగా తెలుసునని కవిత బయటపెట్టారు. ఆయన ఇతర పార్టీల్లోకి వెళ్లేందుకు పావులు కదిపినప్పటికీ కేసీఆర్ మాత్రం ఇప్పటికీ ఆయనను గ్రెండ్‌గా 2

తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# ఉపాధ్యాయుడు తోడిశెట్టి చంద్రయ్య సేవలు చిరస్మరణీయం



**సారంగాపూర్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు):** సారంగాపూర్ మండలం చించోలి (బి) ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన తోడిశెట్టి చంద్రయ్య వీడ్కోలు సభను ఆదిత్య గార్డెన్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ వన్నెల సాయన్న, హెచ్‌ఎం మునీందర్ రాజు మాట్లాడుతూ చంద్రయ్య విద్యాబోధనతో పాటు విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించారని కొనియాడారు. అనంతరం చంద్రయ్య దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటరామిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నరేంద్రబాబు, తోడిశెట్టి రవికాంత్, మురళీ మనోహర్ రెడ్డి, కూన రమేష్, మొహిజుద్దీన్, మధు సిలారి, పోతుగంటి సాయన్న, బచ్చు శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతోనే విద్యార్థుల్లో అపార జ్ఞానం: ఆసంవార్ సాయినాథ్




**ముథోల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు):** నిత్య జీవితంలో పుస్తక పఠనం ద్వారానే విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని రవీంద్ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆసంవార్ సాయినాథ్ అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే గ్రామీణ యువత కోసం విశ్రాంత అధ్యాపకుడు సారథి రమేష్ రచించిన 'ఇంగ్లీష్ గ్రామర్' పుస్తకాన్ని పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి మహనీయులు పుస్తక పఠనంతోనే ఉన్నత శిఖరాలకు చేరారని తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదవడాన్ని నిత్య అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం రచయిత సారథి రమేష్‌ను ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్



**తానూరు/ముథోల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు):** తానూరు మండలం ఎల్వీ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శంకర్ రావు పటేల్ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను ముథోల్ మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణరావు పటేల్ సోమవారం పరామర్శించారు. ఎల్వీ గ్రామంలోని వారి నివాసానికి చేరుకున్న ఆయన మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పుండ్లిక్, దేవిదాస్, శ్యామ్‌రావు పటేల్, చంద్రకాంత్, మధు పటేల్, శంకర్ చంద్ర, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాడు పంజరంలో పక్షులు...

# నేడు సర్కారుపైనే సవాళ్లా?

## అణచివేతపై నిశ్శబ్దం... స్వేచ్ఛపై సమరమా?






స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క ఉన్నతమైన లక్షణం. కానీ, అదే స్వేచ్ఛను ఆసరాగా చేసుకుని ప్రజాస్వామ్య వ్యవస్థలను శాసించాలని చూడటం, ప్రజా తీర్పుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని హెచ్చరించడం తీవ్రమైన అహంకార పూరిత వైఖరి అవుతుంది. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనలు, కొన్ని ఉద్యోగ సంఘాల నేతల నిరసనలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వ్యక్తంచేసిన తీవ్ర ఆగ్రహం,ఆక్రోశం --- "నన్ను బెదిరిస్తున్నారా? ఒత్తిళ్లకు భయపడే ప్రసక్తే లేదు" --- ఈ రోజు రాష్ట్రంలోని ప్రాధాన్యతలను, ఉద్యోగుల నైతిక బాధ్యతలను తీవ్రంగా ప్రశ్నిస్తోంది. ఇది కేవలం ఒక ముఖ్యమంత్రి రాజకీయ ఆవేదన లేదా ఆగ్రహం మాత్రమే కాదు; ప్రజాస్వామ్యంలో ప్రజల పన్నులతో వేతనాలు పొందుతున్న ఒక యంత్రాంగంపై సామాన్య పౌరుడి తరఫున పడిన అత్యంత పదునైన ఎడిటోరియల్ నిలదీత.

**నిరంకుశత్వం దాటిన చోట బెదిరింపులా?**

గత బీఆర్ఎస్ (కేసీఆర్) దశాబ్ద కాలపు పాలనను ఒక్కసారి వెనక్కి తిరిగి స్మరించుకుంటే, ఆనాడు ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి ఏ విధంగా ఉండేదో ఊహించు కోవడానికే ఒళ్లు గగుర్పొడుస్తుంది. నాటి నిరంకుశ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు అందకపోయినా, మెడికల్ బిల్లులు కరిగిపోతున్నా, డీఏ (ణూా) బకాయిలు కొండలా పేరుకుపోయినా ఏ ఉద్యోగ సంఘం నేత కూడా పెదవి విప్పే సాహసం చేయలేదు. ఆనాడు ప్రజాస్వామ్య నిరసనల వేదికైన 'ధర్నా చౌక్'ను నిర్దాక్షిణ్యంగా ఎత్తివేసి, హక్కుల కోసం గొంతు విప్పితే పీడీ (గ్రాణ) యాక్టులు, తక్షణ సస్పెన్షన్లు, దూర ప్రాంతాలకు కక్షపూరిత బదిలీల ఉక్కుపాదం మోపిన వైనం రాష్ట్ర ప్రజలందరికీ బాగా తెలిసిందే. నాడు అణచివేత, భయం ముందర మోకరిల్లి, పంజరంలో పక్షుల్లా మౌనం వహించిన కొందరు ఉద్యోగ నేతలు, నేడు ప్రజాస్వామ్యయుతంగా స్వేచ్ఛను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై "బెదిరింపు ధోరణి" ప్రదర్శించడం వెనుక ఉన్న అసలు రాజకీయం ఏమిటి?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గత పాలకులు మిగిల్చి వెళ్లిన వేల కోట్ల అప్పుల భారాన్ని, తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని మోస్తూ కూడా ఉద్యోగుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చింది. దశాబ్ద కాలంగా అస్తవ్యస్తంగా మారిన వేతనాల వ్యవస్థను గాడిలో పెట్టి, ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగుల అకౌంట్లలో జీతాలు జమ అయ్యేలా చారిత్రాత్మక చర్యలు తీసుకుంది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పంచాయతీ సిబ్బందికి సైతం వేతనాలు క్రమం తప్పకుండా అందుతున్నాయి. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే ప్రాథమిక హక్కును గౌరవిస్తూ ప్రభుత్వం స్వేచ్ఛను కల్పిస్తే, దానిని ప్రభుత్వం యొక్క బలహీనతగా భావించి సర్కారునే శాసించాలని చూడటం ఏ రకమైన న్యాయం?

**ఆర్థిక వాస్తవాలను విస్మరిస్తే ఎలా?**

కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల వైఫల్యాలు, అంతరాయం లేని వడ్డీల భారం, ఖజానా ఖాళీ అయిన దుస్థితి నుంచి రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి గట్టెక్కించేందుకు ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోంది. పిఆర్సి , డీఏ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి ఉద్యోగుల న్యాయమైన అంశాలను ప్రభుత్వం ఎన్నడూ తోసిపుచ్చలేదు. విడతల వారీగా బకాయిలు చెల్లించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తూ, కమిటీలు వేసి పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్న సమయంలో... వీధుల్లోకి వచ్చి తీవ్ర ఒత్తిడి తేవడం, రసాభాస సృష్టించడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ.

ప్రభుత్వ ఉద్యోగులు ఏ ప్రత్యేకాధికార గ్రహం నుంచో ఊడిపడలేదు. వారు రాష్ట్రంలోని సామాన్య ప్రజలు చెల్లించే పరోక్ష, ప్రత్యక్ష పన్నుల ద్వారానే వేతనాలు, సదుపాయాలు పొందుతున్న వ్యవస్థలోని ప్రాథమిక భాగస్వాములు. రాష్ట్రంలో కోట్లాది మంది పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు మరియు నిరుద్యోగుల సంక్షేమం కోసం వెచ్చించాల్సిన ప్రజాధనాన్ని సమతుల్యం చేయాల్సిన గురుతర బాధ్యత పాలకులపై ఉంటుంది. బడ్జెట్ మొత్తాన్ని కేవలం ఉద్యోగుల వేతనాలకే కేటాయించాలనడం ప్రజాస్వామ్య ధర్మానికి విరుద్ధం. ప్రభుత్వంపై రాజకీయ ప్రేరేపిత ఆందోళనలతో దాడి చేస్తే, దాని ప్రభావం నేరుగా సామాన్య పౌరుడిపైనే పడుతుంది.

**ఉద్యోగులు ఆత్మపరిశీలన చేసుకోవాలి**

రాష్ట్ర అభివృద్ధిలోనూ, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ ప్రభుత్వ యంత్రాంగానికి ఉద్యోగులే వెన్నుముక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా అంగీకరించారు. అయితే, ఆ వెన్నుముకే విరిగిపోయేలా నిరంతరం ఒత్తిడి తెస్తే మొత్తం పాలనా వ్యవస్థే కుప్పకూలిపోతుంది. నాటి కేసీఆర్ ప్రభుత్వంలో గొంతు నొక్కుకున్న వేళ చూపిన "భయం", నేటి ప్రజాస్వామ్య స్వేచ్ఛా వాతావరణంలో "బెదిరింపుగా" మారడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ప్రభుత్వం కల్పించిన గౌరవాన్ని, దక్కిన ప్రజాస్వామ్య స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ రాజకీయం చేస్తే ప్రజలు ఏనాటికీ క్షమించరు.

ఉద్యోగ సంఘాల నేతలు వెంటనే ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. రాజకీయ స్వార్థం వేరు, ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన వేరు. బెదిరింపుల సంస్కృతిని పూర్తిగా పక్కనబెట్టి, రాష్ట్ర ఆర్థిక ప్రరిమితులను అర్థం చేసుకుంటూ బాధ్యతాయుతమైన చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడమే ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం. స్వేచ్ఛను గౌరవించే ప్రభుత్వాన్ని సవాలు చేయడం మానుకోకపోతే, అది కేవలం పాలనా వ్యవస్థకే కాకుండా ఉద్యోగ యంత్రాంగంపై ప్రజల్లో ఉన్న విశ్వసనీయతకే తీవ్ర విఘాతం కలిగిస్తుంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# మనసులో నమ్మకం ఉంటేనే మొక్కు విలువ పెరుగుతుందా?

## భక్తి వెనుక ఉన్న ఆ విశ్వాసమే అసలైన బలం

దేవుడి సన్నిధిలో నిలబడినప్పుడు ప్రతి భక్తుడి మనసులో ఒక ప్రత్యేకమైన భావన ఉంటుంది. ఎవరో తమ కుటుంబం కోసం ప్రార్థిస్తారు.. మరొకరు ఆరోగ్యం కోసం కోరుకుంటారు.. ఇంకొకరు జీవితంలో ఎదురైన కష్టాలు తొలగాలని వేడుకుంటారు. కొందరు మొక్కులు చెల్లిస్తారు. మరికొందరు ఏమీ అడగకుండా కేవలం దేవుడి దర్శనం చేసుకుని తిరిగి వస్తారు. ప్రార్థన చేసే విధానం వేరైనా.. అందరినీ కలిపేది మాత్రం ఒక్కటే.. దైవంపై ఉన్న నమ్మకం.

మనిషి జీవితంలో నమ్మకం ఎంత గొప్ప శక్తో చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. రేపు మంచి రోజులు వస్తాయని నమ్మినవాడు ఈరోజు కష్టాన్ని భరిస్తాడు. తన పిల్లలు ఎదుగుతారని నమ్మిన తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేస్తారు. అదే విధంగా దేవుడిపై నమ్మకం ఉన్న భక్తుడు కూడా కష్టాల్లో ధైర్యాన్ని కోల్పోడు. పరిస్థితులు తనకు అనుకూలంగా లేకపోయినా.. "దేవుడు ఉన్నాడు.. మంచి జరుగుతుంది" అనే ఒక చిన్న నమ్మకం అతనికి ఎంతో బలం ఇస్తుంది.

మొక్కు అనేది కేవలం దేవుడికి ఏదైనా సమర్పిస్తానని చేసే మాట కాదు. మనసులో ఒక సంకల్పాన్ని ఏర్పరచుకోవడం కూడా. ఒక కోరిక నెరవేరితే దేవుడికి కృతజ్ఞతగా ఏదైనా చేస్తానని భక్తుడు నిర్ణయించుకోవడం వెనుక తన విశ్వాసం ఉంటుంది. అందుకే మొక్కు విలువ దాని ఖర్చులో ఉండదు. దాని వెనుక ఉన్న భక్తిలో ఉంటుంది.

కొన్నిసార్లు మనిషి కోరుకున్నది వెంటనే జరగదు. అప్పుడే అతని నమ్మకానికి పరీక్ష మొదలవుతుంది. కోరుకున్న ఫలితం ఆలస్యమైనంత మాత్రాన దేవుడిపై విశ్వాసం తగ్గిపోవాల్సిన అవసరం లేదు. మనకు కనిపించని కారణాలు, మనకు తెలియని మార్గాలు జీవితంలో ఎన్నో ఉంటాయి. మనిషి తన వంతు ప్రయత్నం చేస్తూ.. మిగిలినదాన్ని దైవంపై నమ్మకంతో వదిలేయగలిగితే మనసుకు ఒక ప్రత్యేకమైన ప్రశాంతత లభిస్తుంది.

భక్తి అంటే దేవుడిని మన కోరికలకు మాత్రమే అనుసంధానం చేయడం కాదు. మనకు లభించిన దానికి కృతజ్ఞత చెప్పడం కూడా. కష్టకాలంలో దేవుడిని గుర్తు చేసుకున్నట్లే.. సంతోష సమయంలోనూ "ఇది నీ దయ" అని గుర్తు చేసుకోవడం భక్తికి మరింత అందాన్ని ఇస్తుంది. ఎందుకంటే కష్టంలో దేవుడిని వెతకడం సహజం.. సుఖంలో కూడా ఆయనను గుర్తు చేసుకోవడం నిజమైన కృతజ్ఞత.

మన పెద్దలు భక్తికి అంత ప్రాధాన్యత ఇవ్వడానికి ఇదే కారణం. జీవితంలో అన్నీ మన నియంత్రణలో ఉండవని అర్థం చేసుకుని, మన ప్రయత్నాన్ని కొనసాగిస్తూ దైవంపై విశ్వాసం ఉంచడం మనిషికి మానసిక బలాన్ని ఇస్తుంది. అందుకే ఆలయానికి వెళ్లి కొన్ని నిమిషాలు దేవుడి ముందు నిలబడటం కూడా చాలామందికి ఒక కొత్త ధైర్యాన్ని అందిస్తుంది.

చేతిలో ఉన్న పూలు చిన్నవైనా.. మనసులో ఉన్న భక్తి పెద్దదైతే ఆ సమర్పణకు విలువ ఉంటుంది. నైవేద్యం సాధారణమైనదైనా.. కృతజ్ఞతతో సమర్పిస్తే అది ప్రత్యేకమవుతుంది. పెద్ద పెద్ద కానుకలు ఇవ్వడం కంటే.. స్వచ్ఛమైన మనసుతో దేవుడిని స్మరించడం గొప్పదనే భావన మన సంప్రదాయంలో ఉంది.

దేవుడికి మనం ఇచ్చేది ఎంత అన్నది కాదు.. దేవుడిపై మన నమ్మకం ఎంత అన్నదే ముఖ్యం. మొక్కు చేతులతో సమర్పించేది కావచ్చు.. కానీ దాని అసలైన బలం మనసులో పుడుతుంది. ఆ నమ్మకం ఉన్నంతకాలం కష్టం వచ్చినా మనిషి పూర్తిగా కూలిపోడు. ఎందుకంటే అతని హృదయంలో ఒక మాట ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటుంది.. "దైవంపై నమ్మకం ఉంచు.. మంచి రోజులు తప్పక వస్తాయి."



-- సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

## భూభారతి సర్వేపై ముధోల్ మండలంలో విస్తృత గ్రామసభలు

ముధోల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు):




రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి పైలట్ ప్రాజెక్ట్ సమగ్ర భూ సర్వే నిర్వహణ కోసం ముధోల్ మండలంలోని జలాల్పూర్, గూడూరు, గోవిందాపూర్, చందాపూర్ గ్రామాలను ఎంపిక చేశారు. ఈ సర్వే నిర్వహణకు సంబంధించి అనుసంధాన గ్రామాలైన కరేగాం, ఎడ్‌బిడ్, వెంకటాపూర్ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో విస్తృత గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీలత, డిప్యూటీ సర్వేయర్ గంగా నర్సయ్య మాట్లాడుతూ భూభారతి సర్వే విధివిధానాలు, డిజిటల్ భూ రికార్డుల నమోదు, సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియను రైతులకు వివరించారు. సర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, లింక్ డాక్యుమెంట్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భూముల వివరాలు పక్కాగా నమోదైతే భవిష్యత్తులో ఎలాంటి సరిహద్దు వివాదాలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో కరేగాం సర్పంచ్ మైత్రి నారాయణ, ఎడ్‌బిడ్ సర్పంచ్ రామచందర్ రెడ్డి, వెంకటాపూర్ సర్పంచ్ శ్రావణి గంగాశేఖర్, గిర్దావర్ నారాయణరావు పాటిల్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కిర్గుల్ (బి) గ్రామంలో రూ. 40 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ

బాసర, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు):



బాసర మండలంలోని కిర్గుల్ (బి) గ్రామంలో సుమారు రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, గ్రామ సర్పంచ్ తినేట్ల సరోజన రెడ్డి సోమవారం శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం, ప్రధాన వీధుల్లో అంతర్గత సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఈ నిధులను వెచ్చించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా నిధులు కేటాయిస్తున్నామని, పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) పెద్దలు, పంచాయతీ అధికారులు, వివిధ శాఖల ఇంజనీర్లు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిప్రి పెద్ద చెరువు శిఖం భూమిని రక్షించాలి: గ్రామస్తుల ఫిర్యాదు

లోకేశ్వరం, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు):



లోకేశ్వరం మండలంలోని పిప్రి గ్రామ శివారులో గల పెద్ద చెరువు శిఖం భూమిని ఆక్రమణల నుంచి రక్షించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం మండల ప్రజావాణిలో ఎంపీడీవో రామకృష్ణకు లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. పిప్రి పెద్ద చెరువుకు సంబంధించిన సుమారు నాలుగు ఎకరాల శిఖం భూమిని గంగపుత్ర సంఘం ప్రతినిధులు కొన్నేళ్లుగా అక్రమంగా వేలం వేస్తూ పంటలు సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సొమ్ముతో ఇటీవల ఎమర్జెన్సీ కింద నిర్మించిన రెండు నూతన తూములను సైతం ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసేందుకు ఇసుక బస్తాలు వేసి నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తున్నారని వాపోయారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు వెంటనే స్పందించి సంయుక్త సర్వే నిర్వహించాలని, చెరువు హద్దులను నిర్ధారించి ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## ఖర్గే సభ మైదానంలో శుద్ధీకరణ ఘటనపై ముధోల్ పీఎస్‌లో ఫిర్యాదు

ముధోల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు):



ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగ సభ ముగిసిన అనంతరం బీజేపీ శ్రేణులు మైదానాన్ని శుద్ధీకరణ పేరిట శుద్ధి చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తూ ముధోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సీ సెల్ ముధోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జోందలే విశ్వంభర్ ఆధ్వర్యంలో ఎస్సై బిట్ల పెర్సిస్‌కు వినతిపత్రం అందజేశారు. ఒక జాతీయ పార్టీ దళిత అధ్యక్షుడి సభ తర్వాత ఇలాంటి చర్యలకు పాల్పడటం రాజ్యాంగ విరుద్ధమని, కుల వివక్ష, అస్పృశ్యతను ప్రోత్సహించిన బీజేపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి పోతన్న యాదవ్, బషీర్, కిష్టయ్య, అఫ్రోజ్ ఖాన్, మాక్దూమ్, సాయినాథ్, గౌతమ్, సంజు, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పెన్షన్ విద్రోహ దినం: నల్ల బ్యాడ్జీలతో టీజీఈజేఏసీ నిరసన

నిర్మల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు):



సీపీఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) అమల్లోకి వచ్చిన రోజును నిరసిస్తూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1వ తేదీన జిల్లావ్యాప్తంగా 'పెన్షన్ విద్రోహ దినం'గా పాటించనున్నట్లు టీజీఈజేఏసీ నిర్మల్ జిల్లా చైర్మన్ బి. ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు భోజన విరామ సమయంలో నిర్మల్ జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) ప్రాంగణంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. రిటైరైన ఉద్యోగుల జీవితాలకు భరోసా లేకుండా చేస్తున్న సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## దివ్యాంగుల పెన్షన్ దరఖాస్తు గడువు మరో నెల పొడిగించాలి: ఇసాక్ అలీ

నిర్మల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు):




రాష్ట్రంలో అర్హులైన దివ్యాంగులందరికీ ఆసరా పెన్షన్లు అందేలా దరఖాస్తుల గడువును సెప్టెంబర్ 30 వరకు మరో నెల రోజుల పాటు పొడిగించాలని స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసాక్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా కొత్త పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది దివ్యాంగులకు కేవలం 15 రోజుల గడువు ఇవ్వడం సరికాదన్నారు. గ్రామాల్లో సదరం సర్టిఫికెట్లు, ఆధార్ లింకింగ్, ఇతర సాంకేతిక కారణాల వల్ల ఎంతో మంది ఇంకా దరఖాస్తు చేసుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్ మొత్తాన్ని రూ. 6,000 లకు పెంచి సెప్టెంబర్ నెల నుంచే అర్హుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా అరెస్ట్: భైంసా ఏఎస్పీ

.భైంసా, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు):



భైంసా పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగితీగలను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ పత్తిపాక సాయికిరణ్ వివరాలు వెల్లడించారు. సబ్ డివిజన్ పరిధిలో 8 నెలల్లో 33 చోరీలు జరిగాయని, ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో 4 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకాకు చెందిన పెడికే గణేష్, ఘేగర్ దీపక్, గంటలవాడ్ సాయినాథ్, గజానంద్, నక్కలవాడ్ గణేష్‌లతో పాటు భైంసాకు చెందిన పిట్టోల పోశెట్టిలను ముధోల్ పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. వీరి వద్ద నుంచి రూ. లక్షల విలువైన 250 కిలోల రాగితీగలు, 4 బైకులు, 7 సెల్‌ఫోన్లు, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీఐ రవీందర్ నాయక్, ఎస్సైలు బిట్ల పెర్సిస్, దీపక్, జుబేర్, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

## ఉద్యోగుల సేవలు మరువలేనివి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాకు రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా కిషోర్ కుమార్ అందించిన సేవలు ఎంతో ప్రశంసనీయమని కలెక్టర్ భవేశ్ మిశ్రా కొనియాడారు. వరంగల్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌కు కలెక్టరేట్‌లో వీడ్కోలు సభతో పాటు, పదవీ విరమణ పొందిన పశు సంవర్ధక అధికారి బాలిగ్ అహ్మద్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ నరసింహమూర్తిలకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కిషోర్ కుమార్ భూ సమస్యల పరిష్కారం, ధాన్యం కొనుగోళ్లలో అద్భుతంగా పనిచేశారన్నారు. పదవీ విరమణ పొందిన అధికారులు నిబద్ధతతో పనిచేసి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. అనంతరం వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, డీఆర్వో రమేష్, ఆర్డీవో దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## ముధోల్‌లో కనులపండువగా రాష్ట్ర స్థాయి గణిత విజ్ఞాన మేళా

ముధోల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి గణిత, విజ్ఞాన, సాంస్కృతిక మేళా విద్యార్థుల ప్రదర్శనలతో రెండో రోజు కనులపండువగా కొనసాగింది. రాష్ట్రంలోని 8 విభాగాల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. శిశు, బాల, కిశోర వర్గాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, సౌరశక్తి, వ్యర్థాల నిర్వహణ, ఆధునిక సాంకేతికత, గణిత సూత్రాలపై రూపొందించిన అద్భుత ప్రాజెక్టులను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలు ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముధోల్ ఎంఈవో గోపిడి రమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆలోచనలను పెంపొందించేందుకు ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: అదనపు కలెక్టర్లు

## నిర్మల్ కలెక్టరేట్, ముధోల్ ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని అధికారులకు హెచ్చరిక



నిర్మల్/ముధోల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో వారు స్వయంగా పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన బాధితులు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి పెద్ద సంఖ్యలో వినతిపత్రాలను అందజేశారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాథోడ్ రమేష్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే ముధోల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో లవకుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అధికారులకు వినతులు సమర్పించారు. అయితే ప్రజా సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించాల్సిన పలు ముఖ్య శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై అర్జీదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలి: ఏఐపీఎస్‌యూ

## బైంసా సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన విద్యార్థి సంఘం



ముధోల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణానికి తక్షణమే రక్షణ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మించేలా నిధులు మంజూరు చేయాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్‌యూ) నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ మాట్లాడుతూ కళాశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర భద్రతా సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బయటి వ్యక్తులు, అపరిచితులు యథేచ్ఛగా క్యాంపస్‌లోకి ప్రవేశిస్తుండటంతో ముఖ్యంగా విద్యార్థినుల భద్రతకు ముప్పు వాటిల్లుతోందన్నారు. తరగతులు జరుగుతున్న సమయంలో బాహ్య వ్యక్తుల రాకపోకల వల్ల విద్యా వాతావరణం దెబ్బతింటోందని, రాత్రి వేళల్లో ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిధులు మంజూరు చేసి రక్షణ గోడ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# సంచార తెగల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: అదనపు కలెక్టర్



నిర్మల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు): సమాజంలో అత్యంత వెనుకబడిన సంచార, విముక్త తెగల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంచార జాతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార తెగల పిల్లలకు నాణ్యమైన విద్యావకాశాలు కల్పించడంతో పాటు యువత ఆర్థిక స్వావలంబన కోసం స్వయం ఉపాధి రుణాలు అందిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారి ప్రత్యేక సంస్కృతి, కళలు, సాంప్రదాయాలను పరిరక్షిస్తూ ఆత్మగౌరవంతో జీవించేలా సమాజం తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సంచార కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# చదువుకున్న పాఠశాలకు 15 వేల ప్రొజెక్టర్ అందజేసిన న్యాయవాది అరవింద్

## హంగిర్గ బడిలో ఎల్.ఎల్.బి పట్టభద్రుడిని సన్మానించిన ఎంఈవో నరేందర్



తానూరు, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు): తాను ప్రాథమిక విద్యనభ్యసించిన పాఠశాల రుణం తీర్చుకునేందుకు తానూరు మండలం హంగిర్గ గ్రామానికి చెందిన ఎల్.ఎల్.బి పట్టభద్రుడు శీతల్కర్ అరవింద్ విద్యార్థుల డిజిటల్ విద్యాభివృద్ధి కోసం రూ.15,000 విలువైన నూతన ప్రొజెక్టర్‌ను బహుకరించారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) నరేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2007 నుంచి 2012 వరకు హంగిర్గ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుకున్న అరవింద్, అనంతరం బోసి పాఠశాలలో చదివి కష్టపడి ఎల్.ఎల్.బి పూర్తి చేయడం గర్వకారణమని ఎంఈవో కొనియాడారు.

చిన్ననాటి నుంచే అరవింద్‌కు నాయకత్వ లక్షణాలు ఉండేవని, పాఠశాల విద్యార్థి ఎన్నికల్లో గెలిపించి ప్రోత్సహించిన నాటి రోజులను గుర్తుచేసుకున్నారు. అనంతరం తన ప్రియ శిష్యుడైన అరవింద్‌ను ఎంఈవో నరేందర్ శాలువాతో ఘనంగా సత్కరించి ఆశీర్వదించారు. అరవింద్ మాట్లాడుతూ తన ఎదుగుదలకు కారణమైన గురువు సమక్షంలో తాను అక్షరాలు నేర్చిన బడికి ప్రొజెక్టర్ అందించడం పూర్వజన్మ సుకృతమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కె. అజహరుద్దీన్, షేక్ సల్మాన్, పాఠశాల చైర్మన్ సుజాత, చిన్నన్న, బాబురావు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముధోల్ సామాజిక ఆసుపత్రిలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల రోగుల తాకిడి



ముధోల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు): వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఆకస్మిక మార్పుల కారణంగా ముధోల్ మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో స్థానిక సామాజిక ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. పగటి వేళల్లో ఎండ, రాత్రి పూట చలి వాతావరణం వల్ల ప్రజలు తీవ్రమైన జ్వరం, జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులతో దవాఖానను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అధిక సంఖ్యలో అస్వస్థతకు గురవుతున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ పర్యవేక్షణలో వైద్యులు నిరంతరం చికిత్సలు అందిస్తున్నారు. అవసరమైన అన్ని రకాల ప్రాణాధార మందులు, ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి రావాలని కోరారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే భారీ జరిమానాలు: మున్సిపల్ కమిషనర్

## నిర్మల్ పట్టణంలో స్వీట్ షాపులు, బేకరీలపై ఆకస్మిక తనిఖీలు



నిర్మల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మల్ పట్టణంలో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ అధికారులు సోమవారం కొరడా ఝుళిపించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న స్వీట్ హోమ్స్, బేకరీలు, సూపర్ మార్కెట్లలో శానిటరీ విభాగం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. తనిఖీల్లో భాగంగా దుకాణాల్లో నిల్వ ఉంచిన నిషేధిత ప్లాస్టిక్ కవర్లను భారీగా స్వాధీనం చేసుకుని, నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు రూ. 7,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ పర్యావరణానికి పెను ముప్పుగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వ్యాపారులు, ప్రజలు పూర్తిగా బహిష్కరించాలని స్పష్టం చేశారు. వీటికి ప్రత్యామ్నాయంగా బట్ట సంచులను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఇకపై నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రజిని, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అష్ట గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



ముధోల్, ఆగస్టు 31 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండలం అష్ట గ్రామంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ పథకం కింద నిర్మించుకున్న నూతన గృహంలో లబ్ధిదారులు వందన పెంటన్న దంపతులు సోమవారం శాస్త్రోక్తంగా గృహప్రవేశం చేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ నూతన గృహాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేస్తోందన్నారు. ప్రజా పాలనలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని స్పష్టం చేశారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబం సర్పంచ్, ఉపసర్పంచ్‌లను శాలువాలతో సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సావిత్ర కోటయ్య, వార్డు సభ్యులు సురేష్, చిన్నన్న, సేవాలాల్ సంఘం అధ్యక్షుడు అనిల్, నాయకులు మురళి, మీనాజ్, లక్ష్మణ్, సాయన్న పాల్గొన్నారు.


OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-